ప్రవాసాంధ్ర కథ

# మరణానంతరే

**జె.యు.బి.వి.ప్రసాద్**

సూర్యం ఆలోచనలో పడ్డాడు. మొదట్లో వదినా, ఆడపడుచులిద్దరూ తన తండ్రి గురించి బాధపడ్డారు. తర్వాత తనని అన్నయ్య సరిగా చూడలేదని మేనత్త బాధపడితే, అమ్మ, నాన్నని వెనకేసుకొచ్చింది. తర్వాత తన అనుభవాలు గుర్తొచ్చి, అమ్మ నాన్న పనులకి బాధపడింది.



తండ్రి మరణించాడన్న వార్త వినగానే, సూర్యం రెక్కలు కట్టుకుని ఇల్లు చేరాడు. అంత్యక్రియలన్నీ యధాక్రమంగా అయ్యాయి. అతనూ, అతని అక్కా ఇద్దరే పిల్లలు ఆ తల్లితండ్రులకు. సూర్యం పంపించే డబ్బుతో, కూతురింటికి దగ్గరగా వేరే ఇంట్లో వుంటారు.

ఇంటికి చేరిన సూర్యం తల్లిని చూడగానే దుఃఖం ఆపుకోలేకపోయాడు. చాలాసేపు తల్లీ, కొడుకులిద్దరూ ఒకరినొకరు పట్టుకుని ఏడిచారు. ఒకరి స్పర్శలో నొకరు కొంచెం స్వాంతన పొందారు.

కాస్సేపటికి తేరుకుంది తల్లి. ఏడుస్తూనే చెప్పుకొచ్చింది.

"ఆ మధ్యొచ్చిన జబ్బు పూర్తిగా తగ్గిపోయింది. మొహంలోకి చక్కటి కళ వచ్చింది. పొద్దున్న తెల్లారుకట్ట మామూలుగానే నాలుగ్గంటలకి లేచారు. 'మొహం కడుక్కొండీ, కాఫీ తెస్తాను' అని వంటిట్లోకి వెళ్ళాను. ఎంతసేపటికీ చప్పుడు లేకపోయేసరికి గదిలోకి వెళ్ళి చూశాను. మంచం మీద అడ్డంగా పడున్నారు. ఏమిటో భయం వేసింది. గబగబా అక్కకి ఫోను చేశాను. అక్కా, బావా వచ్చి చూసి డాక్టర్ని పిలిచారు. అప్పటికే నాకర్థం అయిపోయింది. డాక్టరు వచ్చి గుండాగిపోయిందన్నాడు. అప్పటి వరకూ కొట్టుకుంటున్న గుండె అప్పుడే ఆగిపోవడం యేమిటీ?" అని భోరున ఏడిచింది.

ఏడుస్తూనే మళ్ళీ, "డాక్టర్లు ఏదో కారణం చెప్పుకొస్తారు. ఎనభై యేళ్ళన్నా నిండలేదు" అంటూ తన బాధనంతా వెళ్ళబోసుకుంది.

సూర్యం అక్క భర్త, "అత్తయ్యగారూ! బాధపడకండి. ఎనభై దాటకపోవడం యేమిటీ? మామయ్యగారికేం! ఎనభై అయిదేళ్ళ వయసులో ఏ బాధా లేకుండా సుఖంగా ప్రాణం వదిలారు. ఎంతో అదృష్టం వుంటేనే గానీ, ఇలా సుఖంగా పోవడం జరగదు" అంటూ ఓదార్చాడు.

ఆ పేషంటు మరణించాడని డాక్టర్లు నిర్ధారించగానే, ఆ మృతదేహాన్నీ, సూర్యం తల్లిని కూతురి ఇంటికి తీసుకువచ్చేశారు, వాళ్ళది సొంత ఇల్లని, అంత్యక్రియలయ్యే వరకూ అక్కడే గడిపారు.

ఆ మర్నాడు పొద్దున్న, "అమ్మా, మనింటికి వెళ్ళిపోదాం" అన్నాడు.

"నేనక్కడికి రాలేను నాయనా! మీ నాన్నే గుర్తొస్తారు. ఆ జ్ఞాపకాలు భరించలేను" అంటూ తల్లి కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

"ఆ జ్ఞాపకాల కోసమే అక్కడకి వెళదాం అని నేనంటున్నాను. 'ఆ జ్ఞాపకాలు భరించలేనూ" అని నువ్వంటున్నావు. నాన్న జ్ఞాపకాలు ఎందుకు మర్చిపోవాలీ?" అన్నాడు సూర్యం బాధగా.

తల్లి అర్థం చేసుకుని, 'వెళదాం' అని ఒప్పుకుంది.

సామాన్లు సర్దుకుని, ఇంకో పావుగంటలో అల్లుడు ఆటో తీసుకు రాగానే, సూర్యం, అతని తల్లీ పక్క సందులో వున్న అద్దింటికి వచ్చేశారు. బావురుమంటున్న ఇంట్లో, తండ్రి జ్ఞాపకాలతో తల్లీ కొడుకులిద్దరూ ఏడుస్తూ కూర్చుండిపోయారు.

బంధువులు రావడాలూ, వెళ్ళడాలూ అన్నీ అయ్యాయి. సూర్యం తల్లి దగ్గర ఇంకా కొన్ని రోజులుంటానని చెప్పి, భార్యాపిల్లల్ని వూరు పంపించేశాడు. తల్లి చీటికీ, మాటికీ ఎవరో ఒకరితో చెప్పుకుని ఏడుస్తూనే వుంది. 'తామిద్దరే వుంటే చాలదనీ, తల్లికి తోడుంటే కాస్త బావుంటుందనీ' సూర్యానికి అనిపించింది. వెంటనే పెద్దమ్మకి ఫోను చేశాడు. తల్లి వేపు బంధువుల్లో ఆవిడ దగ్గర చనువెక్కువ సూర్యానికి. ఆ పెద్దమ్మ ఆ వూళ్ళోనే వుంది, ఓ నాలుగు సందులవతల.


కాస్సేపు ఫోనులో మాట్లాడాక, "పెద్దమ్మా, నేనిక్కడ అమ్మతో ఇంకో పదిహేను రోజులుంటాను. నువ్వు కూడా వచ్చి మాతో వుంటావా తోడుగా? అమ్మ చాలా దిగులు పడుతోంది" అని అడిగాడు సూర్యం.

"నేను మీకు వండి పెట్టలేను, నాయనా!" అంది పెద్దమ్మ.

"అయ్యో, నిన్ను రమ్మంటున్నది అమ్మకి తోడుగా వుంటావని గానీ, మాకు వండిపెట్టడానికి కాదు. అమ్మకీ, నీకూ కూడా నేనే రోజూ వండి పెడతాను. అయినా నాకు ఇంటి పనులూ, వంటా బాగానే వచ్చు. నేనుండగా మీరు వండటం యేమిటీ? చెప్పు, నీకేంకావాలో అన్నీ వండి పెడతాను. పులిహోరా, వుప్పుడిపిండీ చేసిపెట్టనా? నువ్వు వస్తానంటే నేను వచ్చి తీసుకువస్తాను" అని ఫోను పెట్టేశాడు.

జరిగింది తల్లితో చెప్పాడు. తల్లి తలాడించి వూరుకుంది.

పెద్దమ్మ ఏమాలోచించుకుందో, ఏమోగానీ, కాస్సేపటికి ఫోను చేసి,





'వస్తాను లేరా!' అని చెప్పింది. విప్పారిన మొహంతో సూర్యం ఆటోలో వెళ్ళి, అదే ఆటోలో ఆ పెద్దమ్మని తీసుకువచ్చాడు.

పెద్దవాళ్ళిద్దరూ మాట్లాడుకుంటూ వుంటే, ఇంటి పనంతా చులాగ్గా చేసేశాడు. పెద్దమ్మ కోసం కొంచెం పులిహోర చేశాడు. పెద్దమ్మకి చక్కగా ఒక పళ్ళెంలో పెట్టి ఇచ్చాడు. ఆవిడ సంతోషంగా తింది.

తల్లికి పులిహోర అందివ్వబోతే, "ఎందుకు నాయనా? పులిహోరంటే మీ నాన్నకి ఎంతో ఇష్టం" అంది విచారంగా.

"సరే, ఏం చేస్తాం? నాన్న కోసం నువ్వు తిను. నాన్న కడుపులోకి వెళ్ళినట్టే సంతోషిస్తాను నేను" అన్నాడు సూర్యం.

కొడుకు పనితనానికి సంతోషించారు ఆ తల్లులిద్దరూ.

మళ్ళీ విచారంగా తల్లి చెప్పుకొచ్చింది.

"సూర్యం! నాన్న పోయిన మర్నాడు నీ మేనమామ కొడుకు ఫోను చేశాడు.'పదోరోజుకి బట్టలు తీసుకువస్తాం'అని అన్నాడు. 'సరే' అన్నాను. తర్వాత అర్థం అయింది, 'తెల్లబట్టలు తెస్తానంటున్నాడ'ని. అక్క వెంటనే ఫోను చేసి, 'మాకు అలాంటి ఆనవాయితీలు లేవు. మా అమ్మ తెల్ల బట్టలు కట్టుకోదు.అలాంటివి తీసుకురావద్దు' అని చెప్పింది. బాగా గొణుక్కున్నారుట వాళ్ళు. పెద్దమ్మే చెప్పింది. కావాలంటే పెద్దమ్మని అడుగు' అంది తల్లి.

పెద్దమ్మ కూడా అదంతా చెప్పుకొచ్చింది. ఒళ్ళు మండిపోయింది సూర్యానికి.

"అమ్మా! నీ నమ్మకం కొద్దీ ఇంకా ఏమైనా తతంగాలు చెయ్యాలనుకుంటే, అది నీ ఇష్టం. ఎవరైనా నీ దగ్గరకి వచ్చి, 'అది చెయ్యాలి, ఇది చెయ్యాలి' అనంటే నువ్వొప్పుకోవద్దు" అన్నాడు ఆవేశంగా.

అప్పుడు తన మేనత్తకి భర్త పోయినపుడు, ఆవిడతో తెల్లబట్టలు ఎలా కట్టించారో, అదంతా గుర్తొచ్చింది సూర్యానికి.

"అమ్మా, అత్తయ్య సంగతి చెప్పు ఒక్కసారి, అప్పుడేమయ్యిందో?" అడిగాడు సూర్యం.

తల్లి చెప్పడం మొదలుపెట్టింది.

"ఆ, ఎన్నిసార్లు చెప్పుకుంటాం? మీ మేనత్తా వాళ్ళూర్లో చాలా ఘోరం. కిందటేడు మీ మేనత్త భర్త పోయినప్పుడు, నేనూ, నాన్నా వెళ్ళాము. పదోరోజు మీ మేనత్తకి స్నానం చేయించి, తడి బట్టలతో ఒక చీకటి గది మధ్యలో కూర్చోబెట్టారు. ఒక తెల్లబట్ట మీ నాన్న చేతికిచ్చారు. తలుపు దగ్గర నించీ మీ నాన్న, తన చెల్లెలి మొహం చూడకుండా వెనక్కి, వెనక్కి నడుచుకుంటూ, మీ మేనత్త దగ్గర వరకూ వెళ్ళి, చేతిలో వున్న తెల్లబట్ట ఆవిడ మొహం మీద గిరవాటెట్టారు. ఆ తర్వాత ఆవిడ మొహం చూడకుండా, మీనాన్న బయటకొచ్చేస్తే, ఆవిడ ఆ తెల్లబట్ట కట్టుకుని కూర్చుందిట. అప్పుడు అందరూ వొచ్చి చూశారు. వాళ్ళ ఆచారాలు మరీ ఘోరంబాబూ!" కొంచెం పట్నవాసపు నాగరికతతో అంది తల్లి.

మేనత్త సంగతి గుర్తొచ్చి సూర్యానికి మనసు వుడికిపోయింది.

"అదంతా అత్తయ్య ఎలా ఒప్పుకుంది? అసలు నాన్న ఎలా వొప్పుకున్నాడు అలా చెయ్యడానికి? అయితే ఆవిడ రోజూ తెల్లబట్టలే కట్టుకుంటోందా ఇప్పుడు?" అని అడిగాడు సూర్యం.

పెద్దమ్మ అందుకుంది. "మరేంచేస్తుంది. ఇంకా అలాగే వుంది. వుండకేం చేస్తుందీ? వాళ్ళాచారాలలా వుంటే మీ నాన్న ఏం చేస్తాడూ?" అంది పెద్దమ్మ.

"అదేంటి పెద్దమ్మా?" 'నేనలా చెయ్యను' అని నాన్న అనొచ్చు కదా?" అన్నాడు సూర్యం కొంచెం కోపంగా.

"ఆ, వాళ్ళతో గొడవ పడ్డం ఎందుకులే అనుకున్నాడు మీ నాన్న. ఇంకా నయం, గుండు చేయించలేదు నీ మేనత్తకి" అంది పెద్దమ్మ.

అప్పుడు సూర్యానికి మనసు కాస్త తేలిక పడ్డట్టయింది. ఆ మర్నాడు మేనత్త దగ్గర నించీ మళ్ళీ ఫోను. ఎవరి చేతో చేయించింది.

"మీ నాన్న నన్ను ఒక్కదాన్నీ ఒంటరిదాన్ని చేసి పోయాడురా!" అంటూ ఏడిచింది ఫోనులో.

"నేనూ, అమ్మా, అక్కా వుండగా నువ్వు ఒంటరిదానివి ఎలా అవుతావత్తయ్యా?వూరుకో!"అని ఓదార్చాడు సూర్యం.

సూర్యం మళ్ళీ, "అత్తయ్యా, నువ్వు కూడా ఒక పది రోజులు వచ్చి వుండు మా దగ్గర. తరువాత నేను మా వూరెళ్ళిపోతాను" అన్నాడు.

"రేపు బయలుదేరి వస్తాను మీ దగ్గరకి" ఒప్పుకుంది మేనత్త.

"ఎవరితో మాట్లాడావు సూర్యం?" అనడిగింది తల్లి.

"ఇసకపల్లి అత్తయ్యతో. రేపొస్తుందట ఇక్కడకి" అన్నాడు సంతోషంగా.

"మీ మేనత్తా? మంచి మనిషే ఆవిడ. నా చిన్నతనంలో ఆవిడ నన్నొకసారి ఒక ఆపదనించీ కాపాడింది" అంది తల్లి కొంచెం నవ్వు మొహంతో.

ఆ సంగతి సూర్యానికీ తెలుసు. అయినా తల్లిని కబుర్లలో పెట్టొచ్చని, "మళ్ళీ చెప్పు, పెద్దమ్మ వింటుంది" అన్నాడు.

"నాకూ తెలుసు" అంది పెద్దమ్మ చిరునవ్వుతో.

తల్లి మళ్ళీ చెప్పుకొచ్చింది.

అత్తారింటికి వచ్చేసరికి నాకు పదమూడేళ్ళు. మీ నాన్నంటే చచ్చేంత భయం. మీ నాయనమ్మంటే భయం లేదు గానీ, కాస్త జాగ్రత్తగా వుండేదాన్ని ఆవిడ దగ్గర.

ఒకరోజు మధ్యాహ్నం అన్నం తిని, పళ్ళెం తీసి, తిన్నచోట శుభ్రం చేసి, ముందు గదిలోకి వచ్చాను. నేను శుభ్రం చేసిన చోటు చూసి మీ నాయనమ్మకి కోపం వచ్చేసింది. అక్కడ నేను చూసుకోకుండా ఒకే ఒక్క ఎంగిలి మెతుకు వదిలేశాను. చిన్నదాన్ని, హడావిడిలో చూసుకోలేదు. ఇంకేముంది? ఆవిడకి వుగ్రం వచ్చేసింది.

"వాణ్ణి రానీ చెప్తాను నీ సంగతి! అలా ఎంగిలి మెతుకు వదిలేస్తే కుదురుతుందా? వాడొచ్చి నీ పొగరణచాలి" అంది కసిగా.

ఆ ఎంగిలి మెతుకు తీసేద్దామని వెళ్ళబోతే, "వద్దు, తియ్యకు, అదలాగే వుంచు వాడొచ్చేదాకా" అని అరిచింది మీ నాయనమ్మ.


నా గుండె గుబుగుబలాడింది. మీ నాన్న కొడతారన్న భయం లేదు గానీ, కేకలేస్తారన్న భయం మాత్రం వుంది. ఆ ఒక్క ఎంగిలి మెతుకూ పర్వతమంత కనబడింది నాకు. 'ఎలారా, భగవంతుడా' అని విచారిస్తూ కూర్చున్నాను. తల్లి తిట్లు విన్న మీ మేనత్త, ఏడేళ్ళ పిల్ల, ఎగురుకుంటూ వచ్చి, ఆ ఎంగిలి మెతుకు తీసేసి, అవతల పారేసి, చెయ్యి కడుక్కుంది.

అప్పటికి నా మనసు కుదుట పడింది. అక్కడ ఎంగిలి మెతుకు సాక్ష్యంగా లేనప్పుడు, మీ నాయనమ్మ నా మీద చాడీలు చెప్పలేదనీ, చెప్పినా సాక్ష్యం లేదు కాబట్టి మీ నాన్న నమ్మరనీ నా విశ్వాసం.

తల్లి చెప్పిన కథ మళ్ళీ ఇంకోసారి విన్న సూర్యం మొహంలో చిరునవ్వు మొలిచింది.

మేనత్తని చూడగానే దుఃఖం ఆపుకోలేకపోయారు తల్లీ, కొడుకులిద్దరూ.

"వదినా,అన్నయ్య నన్ను ఒంటరిదాన్ని



## కంటి అద్దాలు

"డాక్టర్! మూడు రోజులు నుంచి జ్వరం వుంది. తగ్గటంలేదు." అన్నాడు అప్పుడు ఆసుపత్రికి వచ్చి కూర్చున్న డాక్టర్‌తో రాము.

"మూడు సార్లు గాలి బయటకు వదలండి" అన్నాడు డాక్టర్.


"ఎందుకు సార్! నా ఊపిరితిత్తుల్ని పరీక్షిస్తారా?" అన్నాడు రాము.

"లేదు. నా కంటి అద్దాలు క్లీన్ చేసుకుందామని" అన్నాడు డాక్టర్.

## అడ్డు

స్కూలు పిల్లలకు ఇ.ఎన్.టి డాక్టర్ హెల్త్ చెకప్ చేస్తున్నాడు. ఒక ఎల్.కె.జి పిల్లవాడిని పరీక్షిస్తూ "బాబూ! నీకు ముక్కు, చెవులతో ఎటువంటి ఇబ్బంది రావడంలేదు కదా?" అని అడిగాడు.

పిల్లవాడు: ఆ! మరేమో మా మమ్మీ టీషర్ట్ విప్పేటప్పుడు, వేసేటప్పుడు అడ్డు వస్తున్నాయి సార్!



చేసి వెళ్ళిపోయాడు!" అంటూ యేడిచింది మేనత్త.

ఆవిడకు పుట్టింటి వేపు మిగిలింది సూర్యం తండ్రి ఒక్కడే. మేనత్త ఏడుస్తూ మాట్లాడింది.

"అప్పుడప్పుడు ఇంటికి పిలిచి చీర పెట్టేవాడు. అన్నయ్య ఒకడున్నాడు నాకు అని కాస్త ధైర్యంగా వుండేది. ఇంక నాకు పుట్టింటి ఆశ లేకుండా పోయింది" అంది దిగులుగా.

"మళ్ళీ అదే మాటంటావు. నాన్న వేపునించీ నేనున్నానుగా. ఇదే నీ పుట్టిల్లనుకో!" అని ఓదార్చాడు సూర్యం.

"మా ఆయన పోయినప్పుడు వచ్చాడు అన్నయ్య. అదే చూడ్డం. అదే ఆఖరి చూపయిపోయింది. నిద్ర పోతున్నట్టుండిన అన్నయ్యని చూశాను మళ్ళీ.అవసరంలో డబ్బు సర్దాడు ఒకటీ, రెండుసార్లు" అన్నీ గుర్తు చేసుకుంటూ మళ్ళీ యేడిచింది మేనత్త.

వదినగారు అందుకొంది.

"అక్కడకీ మీ అన్నయ్య అంటూనే వున్నారమ్మా! 'వేసవికాలం శలవుల్లో సూర్యం, భార్యాపిల్లలతో వస్తాడూ, మా లక్ష్మిని కూడా రమ్మనాలీ' అని అంటూనే వున్నారు.అందరూ ఇంట్లో తిరుగుతూ వుండాలనే ఆయన ఆశ తీరకుండా పోయింది" అంటూ ఏడ్చింది తల్లి.

"రెండేళ్ళకిందటేగా, సూర్యం వచ్చినప్పుడు నన్నూ, మాఆయన్నీ పిలిచి, మాకు, మా పిల్లలకీ కూడా మంచి బట్టలు పెట్టాడు. ఆ జ్ఞాపకాలే మిగిలాయి వదినా!" అంటూ తలుచుకుని, తలుచుకుని బాధపడింది మేనత్త.

"ఆయన ఇంట్లో ఆ కుర్చీలో కూర్చుంటే, ఒక పులి వున్నట్టే వుండేది. ఎంతో ధైర్యంగా వుండేది. ఏ కష్టం వొచ్చినా, 'ఎందుకూ దిగులు? నేను చూసుకుంటానుగా' అనంటూ ఆలోచనలు చెప్పేవారు. 'ఇంకో పదేళ్ళు ఎటువంటి ఢోకా లేదూ ఈయనకి' అని అనుకుంటూ వుండేదాన్ని. ఎదురింటి ముసలాయన ఈయనకి స్నేహితుడయ్యారు. ఎదురింటాయనకి పాపం బ్రహ్మచెముడు. నేను వంట చేసుకోలేకపోతున్నాననీ, వంటావిడెవరన్నా దొరుకుతుందా అనీ, కాగితం మీద రాసి మీ నాన్న ఆ ముసలాయనకి చూపించారు. ఆయన కనుక్కుంటానన్నారు. 'మనిద్దరమే కదా, వంటావిడెందుకూ, నేను చేస్తాలెండి' అంటూ వుండేదాన్ని. ఎంత చక్కటి జీర్ణశక్తి ఆయనకి! అరక్కపోవడం అనేదే ఎప్పుడూ వుండేది కాదు. పోవడానికి ముందురోజు దొండకాయలు తరిగి పెట్టారు మర్నాటికని. అవి తినేయోగం లేకుండా పోయిందాయనకు. పులుసు కోసమని ములక్కాడలు కూడా కోసిపెట్టారు. అవంటే ఆయనకెంత ఇష్టమో!" అంటూ తల్లి మరింత బాధపడింది.

"అవునొదినా! అన్నయ్యకి చిన్నప్పటి నించీ రుచులెక్కువ. కాస్త అభిమానాలు తక్కువ. వున్న మాటనాలి. అన్నయ్యతో ఈ రాకపోకలు సూర్యం వుద్యోగంలోకి వచ్చినప్పటి నించే కదమ్మా? అంతకుముందర చూసి ఎన్నాళ్ళయిందీ? నీ కూతురి పెళ్ళప్పుడు చూశాను. అప్పట్లో ఈ పెట్టుపోతలేవీ లేనేలేవు కదా?" అంది మేనత్త ఇంకా వెనకటి గతాన్ని గుర్తు చేసుకుంటూ.

"అంతకుముందు పెట్టడానికి మా దగ్గరేముందీ, బుగ్గి? సూర్యం డబ్బు పంపిస్తున్నాడు కాబట్టి, కాస్త పెట్టుపోతలు జరిపారాయన. అదీగాక మీ అమ్మగారు పెట్టిన గొడవల్తో ఆయన మనసు విరిగిపోయింది" అంది తల్లి తన భర్త వెనకేసుకొస్తూ.

"ఏం పెట్టాలమ్మా? మణులా, మాన్యాలా? తోడబుట్టినదాని మీద అభిమానం వుండాలి గానీ, ఒక రవికల గుడ్డ పెడ్తే చాలదూ? 'అన్నయ్యొకడున్నాడు నాకు' అని ఎంత సంతోషంగా వుంటుందీ? అమ్మతోటీ, పెద్దన్నయ్యతోటీ గొడవలుంటే, నేనేం చేస్తానూ? .అన్నయ్యతో గొడవలున్న వారంతా ఎప్పుడో పోయారు కదా, వదినా? చెల్లెలి మొహం అయిదేళ్ళకోసారి చూడ్డానికూడా, అన్నయ్యకి వాళ్ళ గొడవ లడ్డొచ్చాయా? నువ్వు మరీ చెప్తావు వదినా!" అంది మేనత్త తగ్గకుండా.

తన భర్తమీద అభాండాలొచ్చేస్తున్నాయని తల్లికి ఆదుర్దా.

"నీ పెళ్ళప్పుడు వస్తే ఆయనకేం గౌరవం జరిగిందమ్మా? నీ మిగిలిన అన్నదమ్ములూ, అక్కలూ ఆయన్ని సరిగా చూశారా? మీ అమ్మగారు మాత్రం 'చిన్నకొడుకు, చిన్నకొడుకు' అననడమే గానీ, ఆయన్ని పట్టించుకుందెప్పుడూ? చిన్నప్పుడు చదువు సరిగా చెప్పించలేదు. బడి మానేసి తిరుగుతూంటే, స్తంభానికట్టేసి, చావబాదారే గానీ, ఆయన్ని దార్లో పెట్టారా? దెబ్బలకి ఓర్చుకోలేక ఇంట్లోంచి పారిపోయి, ఎక్కడో పని చేసుకుంటూ బతికితే, అప్పుడు మొదలయ్యాయి రాకపోకలు. వున్నదంతా మీ అమ్మగారు పెద్దకొడుక్కే పెట్టుకుంది. ఈయన పనిచేసి సంపాదించిన డబ్బుతో పెద్ద కొడుక్కి పరీక్ష ఫీజులు కట్టింది. వాళ్ళంటే ఈయనకి విరక్తి పుట్టేసింది. అంతా చేసి మీ అమ్మగారు పోయినప్పుడు ఆ పెద్ద కొడుకు సమయానికి రానేలేదు. ఈయనే తల కొరివి పెట్టాల్సొచ్చింది" అంటూ తల్లి తన భర్త మీద ఈగ వాలనీయలేదు.

"అభిమానాలడిగాను గానీ, పెట్టుపోతలడిగానా? 'నా' అనేవాళ్ళు లేక, గంపెడు సంతానంతో .ఎన్ని కష్టాలు పడ్డానో ఆ దేముడికే తెలియాలి. నా పెళ్ళి కుదిరిందని మీ వూరికి కబురంపిస్తే, ఇంట్లో వుండీ లేననిపించాట్ట అన్నయ్య. రక్తసంబంధం అని అనుకోవడమే గానీ, ఏం ఒరిగిందీ నాకూ?" అంటూ మేనత్త లాజిక్‌లోకి దిగింది.

"అదేంటమ్మా లక్ష్మీ, అలా అంటావూ? మీ ఆయన పోయినప్పుడు మీ అన్నయ్య నీ కొడుక్కి అయిదువేలివ్వలేదూ? చాతనయినంత మటుక్కి ఆయనా చేశారు కదమ్మా?" అంది తల్లి వదలకుండా.

"ఇచ్చాడమ్మా. కాదనలేదు. అంతేకాదు మా మనవరాలి పెళ్ళంటే ఇరవై వేలు అప్పు కూడా ఇచ్చాడు అన్నయ్య, వడ్డీ లేకుండా. నా కొడుకు ఆ మొత్తం అప్పు తిరిగి తీర్చేశాడు కూడా. నీ కొడుకు బాగానే సంపాదిస్తున్నాడు కదా? మాలాంటి పేదవాళ్ళ దగ్గర నించీ డబ్బు తిరిగి తీసుకోకపోతే, ఏం నష్టం? అగ్ని ప్రమాదంలో ఒళ్ళు కాల్చుకుని, వుద్యోగం పోగొట్టుకుని, తండ్రిని పోగొట్టుకుని అవస్థలు పడుతున్న నా కొడుక్కి, అన్నయ్య అయిదు వేలిచ్చాడు! అదేనా వొదినా, గొప్ప అభిమానం? మేమెన్ని కష్టాల్లో వున్నా, అదేనా ఆదుకోవడం?"

"నీ కొడుకు అగ్నిప్రమాదంలో వొళ్ళు కాల్చుకుని, ఇదే వూళ్ళో ఆసుపత్రిలో వుంటే, మాకు మాట మాత్రమైనా చెప్పారా? ఎవరి ద్వారానో తెలిసింది. మరి అభిమానాలు ఎక్కడి నించీ వొస్తాయి?"

"చెబితే మాత్రం ఏం చేసేవారమ్మా? మీరిద్దరూ పెద్దవాళ్ళు. చెప్పి మిమ్మల్ని ఇబ్బంది పెట్టడం ఎందుకూ అని చెప్పలేదు. మహా అయితే అన్నయ్య కాస్త అప్పిచ్చేవాడేమో!" అంటూ దెప్పింది మేనత్త.


"అప్పు అప్పంటావు గానీ, తీర్చమని అన్నయ్య ఒక్కనాడన్నా అన్నారా? సూర్యం కూడా ఆ డబ్బు ఎప్పుడూ అడగొద్దూ అనే అన్నాడు. మీరే ఇచ్చారని తీసుకున్నాం తప్ప, మా అంతట మేమెప్పుడూ అడగలేదు. తిరిగి తీసుకున్నందుకు సూర్యం నొచ్చుకున్నాడు కూడా. మళ్ళీ కావల్సినప్పుడల్లా ఇద్దాం అని అన్నయ్య అన్నారు. అయినా, మీ అన్నయ్య నా మాట ఎంత వింటారో నీకు తెలియదా? నేనెంత చెప్పినా ఆఖరికి ఆయనిష్టం వొచ్చినట్టు ఆయన చెయ్యడమే కదా?" అంది తల్లి వాపోతూ.

"కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడుతుందంటారు. ఇద్దరన్నయ్యలుండీ నాకేం ఒరిగిందీ? సెంటు భూమిలేనివాడికి కట్టబెట్టారు. చిన్న వుద్యోగం తప్ప ఆయనకేముందీ? గర్భ దరిద్రం అనుభవించానమ్మా. ఒక్క అన్నయ్య అయినా పట్టించుకున్నది లేదు. ఆస్తినంతా పంచుకున్న అన్నయ్యలకి, చెల్లెలి పెళ్ళి బాధ్యత పట్టదా? కడుపు రగిలిపోతూ వుంటుందమ్మా నాకు తలుచుకుంటుంటే" అంది మేనత్త బాధతో.

సూర్యం ఆశ్చర్యపోతూ తల్లివేపూ, మేనత్తవేపూ చూస్తూనే వుండిపోయాడు. పెద్దమ్మ కూడా ఆ మాటలు వింటూ కూర్చుంది.

"ఆ పంచుకున్న ఆస్తి ఎప్పుడో తగలేశారు ఈయన. ఒక్క మాట నాకు చెప్పేవారా? ఒక్క మాట నేను చెబితే వినేవారా? పిల్లలు పెరిగొచ్చాక ఈ సహనం వొచ్చింది గానీ, అంతకుముందెక్కడా? మా నాన్నకి జబ్బుగా

(మిగతా 41వ పేజీలో)



భార్యతో తూతెన్‌ఖామెన్ చిత్రం

మీద అరబిక్‌తో పాటు కన్పిస్తాయి. అక్కడా మనలాగానే షాపింగ్ మాల్స్, ఆధునికమైన దుకాణాలు పుట్టుకొస్తున్నాయి. మా గైడ్ చెప్పిందాన్ని బట్టి అక్కడా చైనా వస్తువులు కుప్పలు తెప్పలుగా వచ్చి పడ్తున్నాయి.

** ** **

ఈజిప్టు జనాభా 75 మిలియన్లు అంటే 7.5 కోట్లు. 85 శాతం ముస్లింలయితే, 15 శాతం క్రిస్టియన్లు. యూదులు ఓ పన్నెండు వందల మంది మాత్రమే ఉన్నారట. కాని కైరో మొదలైన నగరాల్లో మొత్తం 17 సెనెగోగ్‌లు ఉన్నాయని ముస్లింలు క్రైస్తవులు యూదులు ఈజిప్టులో సామరస్యంతో జీవిస్తున్నారని మా గైడ్ చాల గర్వంగా చెప్పాడు సెనెగోగ్ అంటే యూదుల ప్రార్థనాలయం. ఒకప్పుడు ఈజిప్టులో యూదుల సంఖ్య ఎక్కువగా ఉండేదేమో. అందుకే ప్రాచీనమైన 17 సెనెగోగ్‌లున్నాయి. ఇక ఆధునిక ఈజిప్టులో అధికజనాభాతో సమస్యలు పుట్టుకొస్తున్నాయి. అధిక జనసంఖ్యతో అభివృద్ధి కుంటుపడుతున్నదని గైడ్ మాతో అన్నాడు. మన దేశంలోలాగే పట్టణాల్లో ఉద్యోగాలు, పనులు, సౌకర్యాలు పెరగడంతో పల్లెటూళ్ల నుంచి జనం పట్టణాలకు ఎగబడ్తున్నారు. దాంతో పట్టణాల జనాభా పెరిగిపోతున్నది. ముఖ్యంగా రాజధాని నగరం కైరో విపరీతంగా విస్తరిస్తున్నదట. కైరో నగరంగాని ఇతర లక్సర్, అస్వాన్ మొదలైన పట్టణాలన్నింటిలో విశాలమైన రోడ్లు ఉన్నాయి. కైరో అంతటా పన్నెండు ఇరవై అంతస్తుల భవనాలు, అపార్టుమెంటులే కన్పిస్తాయి.

** ** **

ఘీసాలో వున్న మూడు పిరమిడులు వాటి చుట్టూ విశాలమైన ప్రాంగణం, ఆ ప్రాంగణంలో 'మార్చ్యురీ'అనే కట్టడం, మమ్మీలను తయారుచేసే దేవాలయం, ఇంకా పిరమిడులకు కాపలాగా నిర్మించిన అతి పెద్దదైన 'స్ఫింక్' మిగిలి వుండి చూపరులను అద్భుతరసంలో ముంచెత్తుతున్నాయి. క్రీ.పూ. ఐదవ శతాబ్దం వాడైన గ్రీకు చరిత్రకారుడు హెరడోటస్ ఈజిప్టును సందర్శించి అక్కడి పిరమిడులను, దేవాలయాలను చూసి అద్భుతాశ్చరాల్లో మునిగిపోయాడట. హెరడోటస్ కాలంనాటి చాలా నిర్మాణాలు పూర్తిగా నిలువకున్నా ఇప్పటికి ఎన్నో దేశాల నుంచి వచ్చే సందర్శకులను అవి ఇంకా అద్భుతాశ్చర్యంలో ముంచెత్తుతూనే వున్నాయి. ఘీసాలోని పిరమిడులు క్రీ.పూ. 2700-2500 మధ్య కాలంలో కట్టబడినాయి. మూడు పిరమిడుల్లో 'కఫ్రా' నిర్మించిన పిరమిడ్ చాల పెద్దది. దాన్ని కట్టడానికి ఇరవై సంవత్సరాలు పట్టాయట. లక్షమంది కూలీలు పనిచేశారట. దానిక్కావలసిన రాళ్లను పగలగొట్టి ఒక్క ఆకారంలో చెక్కటానికి పది సంవత్సరాలు, నిర్మాణానికి పది సంవత్సరాలు పట్టాయట. ఇది పదమూడు ఎకరాల స్థలంలో ఆరు మిలియన్ టన్నుల బరువు గల రాళ్లతో కట్టబడింది. దీని ఎత్తు 480 ఫీట్లు. ఈ పిరమిడును మెట్లుమెట్లుగా కట్టి పైన 'లైమ్ స్టోన్'లు పరిచారు. కాని కొన్నే మిగిలాయి. వందల సంవత్సరాలుగా జనం పిరమిడులపైనున్న రాళ్లను ఎత్తు కొనిపోయి ఇండ్లను నిర్మించుకున్నారు. కొన్ని కాలం సమ్మెటలతో ఊసిపోయాయి. ఈజిప్టులో ఇప్పుడు మొత్తం 114 పిరమిడులున్నాయి. ఇంకా ఇసుక దిబ్బల కింద కొత్తగా కొన్ని భవిష్యత్తులో దొరికినా దొరకవచ్చును. వీటిలో ఘీసాలోని 'కఫ్రా' తన కోసం నిర్మించుకున్న పిరమిడే అతి పెద్దది. విశాలమైంది. ప్రపంచంలోనే అద్భుతమైంది. అఖెనా తన్, రామెసెస్-2 మొదలైన ఎందరో ఫెరోల సమాధులు 'వ్యాలీ ఆఫ్ కింగ్స్' అని ఇప్పుడు పిలుస్తున్న చోట దొరికాయి. చాలా సమాధులను మనం లోపలికి దిగి చూడవచ్చు. కాని 'తూతెన్‌ఖామెన్' సమాధి చూడాలంటే డెబ్బయి ఈజిప్టు పౌండ్లు టికెట్ పెట్టి కొనుక్కోవాలి. అలాగే దీని సమీపంలోనే 'హాత్‌షేప్‌సుత్' రాణి నిర్మించిన దేవాలయం ఉంది. ఇక్కడికి కాస్త దూరంలో 'వ్యాలీ ఆఫ్ క్వీన్స్' ఉంది. అక్కడ నెఫర్‌తీతి మొదలైన రాణుల సమాధులు డెబ్బయి వరకు వున్నాయి.

** ** **

ఈజిప్టు నాగరికత ఈజిప్టియన్లకు నైలునది ఇచ్చిన కానుకగా చరిత్రకారులు పేర్కొన్నారు. కాని మా గైడ్- ఆ మాట సత్యం కాదని నైలు నాగరికత ఈజిప్టియన్లు ఈజిప్టియన్లకిచ్చిన కానుకగా పేర్కొన్నాడు. ఇది ముమ్మాటికీ నిజం. ఇలాంటి విలక్షణమైన దేశాన్ని సందర్శించటం అద్భుతమైన అనుభవం. ఇక్కడ పర్యాటకులకు మంచి ఆదరణ లభిస్తోంది. భాష సమస్యకాదు. గైడ్‌లు, హోటళ్ళలో, దుకాణాల్లో కొద్దోగొప్పో ఇంగ్లీషు మాట్లాడ్తారు. 'విశిష్టమైన నాగరికత వర్ధిల్లిన ఈజిప్టులో పర్యటించడం మన సృజనాత్మక జీవితాన్ని సంపద్వంతం చేస్తుంది. •

# మరణానంతరే

(22వ పేజీ తరువాయి)

వుందని టెలిగ్రాం వస్తే పంపించారా, ఈయన? ఒక రోజంతా తిండి మానేసి యేడిస్తే, ఆ మర్నాడు బిట్రగుంట పేసెంజరుకి సూర్యంతో పంపించారు. అప్పుడు వాడికి ఏడేళ్ళు. వెళ్ళేటప్పటికి యేం మిగిలిందీ మాకు, చూడ్డానికి బూడిద తప్ప? ఆఖరి చూపు దక్కనేలేదు. అక్కడికీ ఆ తమ్ముడెళ్ళి బస్ స్టేషన్లోనూ, రైలు స్టేషన్లోనూ చూశాడుట, నేనొస్తానేమోనని. వయసయిపోయాక వచ్చిన అభిమానాలేగానీ, ఈయన నన్ను పట్టించుకుందెప్పుడూ?" అంది బాధగా తల్లి.

"మా ఆయనా అంతే! పిల్లల పెళ్ళిళ్ళయ్యాక, కాస్త దూకుడు తగ్గి, నా మాట కాస్త చెవినేసుకోవడమే గానీ, అంతకుముందెక్కడా? అన్నయ్య అయినా, భర్త అయినా మొగవాళ్ళే కదా? వీళ్ళకి ఆడవాళ్ళ విషయాలంటే చిన్నచూపే కదా?" అంది మేనత్త సానుభూతిగా.

"చిన్నతనంలో పెళ్ళి చేశారు. మీ అన్నయ్యంటే హడలు నాకు. ఒక్క మాట మాట్లాడేవారా ఇంట్లో? ఆయనొక సినిమాకి వెళితే, నన్ను వేరే టాకీసులో ఇంకో సినిమాకి పంపించేవారు. పెళ్ళాంతో సినిమాకి వెళ్ళడానికి నామోషీ ఈయనకి. సూర్యం దగ్గరక్కి వెళ్ళినప్పుడు మొట్టమొదటిసారి ఈయనతో కలిసి సినిమాకి వెళ్ళాను. అదీ సూర్యం తీసుకెళ్ళబట్టీ! పిల్లల చిన్నతనంలో, ఈయన ఇంటి విషయాలు యేం పట్టించుకున్నారూ? ఎంతసేపూ తన వుద్యోగం తప్ప, ఈయనకేం పట్టిందీ? అన్నీ నేనే చూసుకున్నాను. వారానికోసారి పిల్లలతో మాట్లాడ్డం గగనం అయిపోయేది ఈయనకి. ఆదివారం కూడా ఆ పాడు వుద్యోగమే! అన్నీ సర్దుకుంటూ వొచ్చాను. వొంట్లో వోపిక నశించాక, పిల్లాడు వేరే వూరెళ్ళాక కదా, ఈయన ఇంటి పట్టునుండేదీ? అప్పటి నించీ వుట్టుకొచ్చాయి ఈ ప్రేమలూ, అభిమానాలూ!"అంటూ తల్లి మనసులో బాధ వెళ్ళబోసుకుంది.

వదినా, ఆడపడుచుల మాటలకి సూర్యానికి తల తిరిగిపోయింది.

"పెద్దమ్మా, నువ్వేం మాట్టాడవేం" అని అడిగాడు.

"ఏం మాట్టాడనూ? వింటున్నాను. మీ పెదనాన్నగారూ అంతే! వయసులో వున్నంత వరకూ పెళ్ళాం, పిల్లలూ అంటే లెక్కలేదు. వీళ్ళ మాటలు విన్నాక నాకు మీ పెదనాన్నగారి ఆగడాలు గుర్తొస్తున్నాయి. చివరి రోజుల్లో కాస్త ప్రేమగానే వుండేవారు. 'ఒసే, ఒసే' అని అస్తమానూ ప్రతీదానికీ నన్నే పిలుస్తూ వుండేవారు" అంది పెద్దమ్మ.

సూర్యం కోపంగా, "ప్రేమలుకాదు పెద్దమ్మా, చివరి వయసులో చాకిరీ చేయించుకోవడం కోసం అలా అభిమానంగా పిలుస్తారు" అని అన్నాడు.

ఆ మాటలు విని పెద్దమ్మ, "ఇదంతా చూస్తే యేమనిపిస్తోందంటే, వయసులో వున్నప్పుడు ఏమీ పట్టించుకోని ఈ మొగవాళ్ళకి, వయసు మళ్ళాక ప్రేమలూ, అభిమానాలూ పుట్టుకొస్తాయని" అంది వైరాగ్యంగా.

సూర్యం ఆలోచనలో పడ్డాడు. మొదట్లో వదినా, ఆడపడుచులిద్దరూ తన తండ్రి గురించి బాధపడ్డారు. తర్వాత తనని అన్నయ్య సరిగా చూడలేదని మేనత్త బాధపడితే, అమ్మ, నాన్నని వెనకేసుకొచ్చింది. తర్వాత తన అనుభవాలు గుర్తొచ్చి, అమ్మ నాన్న పనులకి బాధ పడింది. ఆడవాళ్ళు భర్తలు పోయాక ఇలా చెప్పుకుంటారన్న మాట! తను కూడా ఒక భర్తేగా! అప్పటికే అక్కడకి వచ్చిన సూర్యం అక్క అంతా వింది. "భర్తల గురించి ఆ భార్యలు మాట్టాడుకున్నదంతా భర్తలు వింటే బాగుణ్ను. ఆ భర్తలకి ఆ విషయాలు తెలుస్తాయి" అంది అక్క విచారంగా.

"ఎందుకు తెలియవూ? నేను కూడా ఒక భర్తనే కదా. నాకు తెలిస్తే చాల్లే" అన్నాడు సూర్యం.

తన మరణానంతరం తన భార్య తనగురించి ఎలా చెప్పుకుంటుందో!? •